క్లుప్తంగా

'జగనన్న ఆరోగ్య సురక్ష'



కార్యక్రమంలో పాల్గొన్న వైద్యారోగ్య సిబ్బంది

వంగర: మండలంలోని ఎం.సీతారాంపురం గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన వైద్య శిబిరానికి హాజరైన రోగులకు వైద్యారోగ్య సిబ్బంది ఆరోగ్య తనిఖీలు చేసి, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. శిబిరానికి 120 మందికి పైగా రోగులు తనిఖీలకు హాజరైనట్లు వైద్యాధికారిణి జ్యోతి తెలిపారు. కార్యక్రమంలో వంగర పీహెచ్‌సీ వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఇంటి వద్దనే ఓటేసే అవకాశం



దివ్యాంగునికి ధ్రువీకరణ పత్రాలను అందిస్తున్న ఎన్నికల సెక్టోరియల్ అధికారి దుర్గారావు

వంగర: త్వరలో జరగబోయే సార్వత్రిక ఎన్నికల్లో దివ్యాంగులు(40 శాతం అంగవైకల్యం కలిగిన), 85 ఏళ్ల వయసు దాటిన వృద్ధులకు ఇంటి వద్దనే ఓటు వేసే అవకాశాన్ని కేంద్ర ఎన్నికల సంఘం కల్పించింది. ఈ మేరకు ఎన్నికల సెక్టోరియల్ అధికారి వై.దుర్గారావు మండలంలోని కింజంగి గ్రామంలో శుక్రవారం పర్యటించి, అర్హులను గుర్తించారు. అర్హులంతా ఇంటి దగ్గర ఓటు వేసేందుకు తొలుత నాలుగు రకాల ధ్రువీకరణ పత్రాలు అందించాలని వారికి తెలిపారు. ఈ అవకాశాన్ని అర్హత కలిగిన వారంతా సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అవాంఛనీయ ఘటనలకు పాల్పడితే కఠిన చర్యలు

రామభద్రపురం: సార్వత్రిక ఎన్నికల్లో అవాంఛనీయ ఘటనలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ శ్రీనివాసరావు హెచ్చరించారు. ఎస్పీ దీపికా పాటిల్ ఆదేశాల మేరకు మండలంలో గుర్తించిన సమస్యాత్మక, అతిసమస్యాత్మక గ్రామాల్లో గురువారం రాత్రి ఆయన పర్యటించి, ఆయా గ్రామాల పెద్దలు, ప్రజలతో సమావేశం నిర్వహించి, మాట్లాడారు. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా అందరూ సహకరించాలని కోరారు. గ్రామాల్లో బైండోవర్ కేసులు కూడా నమోదు చేస్తున్నామన్నారు. ఓటర్లు ప్రలోభాలకు లొంగకుండా స్వేచ్ఛగా ఓటు వేసుకోవాలన్నారు. ఎక్కడ ఎటువంటి అవాంఛనీయ ఘటన జరిగినా సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో సీఐ తిరుమలరావు, ఎస్‌ఐ జ్ఞానప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు



బెల్లాన శంకరరావు

వంగర: మండల కేంద్రానికి చెందిన బెల్లాన శంకరరావు అదృశ్యమైనట్లు కేసు నమోదు అయిందని హెడ్‌కానిస్టేబుల్ రాములు శుక్రవారం తెలిపారు. ఈ నెల 11వ తేదీన శ్రీకాకుళంలోని ఓ ఆస్పత్రికి వెళ్తానని చెప్పి, వెళ్లిన వ్యక్తి ఇంతవరకు ఇంటికి తిరిగి రాలేదని ఆయన భార్య బెల్లాన జగదాంబ పోలీసులకు ఫిర్యాదు చేసిందని, ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన

రాజాం సిటీ: అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా స్థానిక సన్ స్కూల్‌లో అగ్ని ప్రమాదాల నివారణపై శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్‌వో టి.ఎస్.ఎస్.జనార్దనరావు.. ప్రమాదాలు జరిగే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ప్రమాదాల్లో చిక్కుకున్న వారిని రక్షించే తీరును ప్రదర్శన ద్వారా వివరించారు. అవగాహనతోనే ప్రమాదాల నివారణ సాధ్యమని, ప్రతి ఒక్కరూ ప్రమాదాల సమయంలో అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. అనంతరం శ్రీకాకుళం రోడ్డులోని అమృత ఆస్పత్రిలో సిబ్బందికి ప్రమాద సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలిపారు.

కోండ్రు ఆస్తి రూ.18.95 కోట్లు

రాజాం: రాజాం టీడీపీ అభ్యర్థి కోండ్రు మురళీమోహన్ కుటుంబం ఆస్తి ప్రస్తుతం రూ.18,95,23,263లుగా ఎన్నికల అఫిడవిట్‌లో పేర్కొన్నారు. ఇందులో తన పేరున రూ.2కోట్ల13లక్షల43వేల300లుగా చూపించగా, వ్యాపార లావాదేవీలు, వినియోగానికి సంబంధించిన ఆస్తి కేవలం రూ.48.87 లక్షలు కాగా, స్థల, వస్తు రూపేణ ఉన్న ఆస్తి రూ.1.64 కోట్లుగా పేర్కొన్నారు. నామినీ శ్రీలక్ష్మి పేరు మీద రూ.16కోట్ల 81లక్షల79వేల 963లుగా చూపించగా, ఇందులో వ్యాపార లావాదేవీలు, బ్యాంకు ఇన్సూరెన్స్‌లకు సంబంధించి రూ.6.98 కోట్లు ఆస్తిగా పేర్కొనగా, స్థిరాస్తి విలువ రూ.9.83 కోట్లుగా ధ్రువీకరించారు. వీటికి సంబంధించి 2023 ఆర్థిక సంవత్సరంలో రూ.5,74,210లు ట్యాక్స్ చెల్లించగా, నామినీ రూ. 18,24,470లు చెల్లించినట్టు ధ్రువీకరించారు. ఆస్తుల్లో అభ్యర్థితో పాటు నామినీకి ప్రైవేట్ బ్యాంకుల, ఇతర రుణాలు రూ.10.41 కోట్ల మేర ఉన్నట్టు చూపించారు. రూ.6,98,22,263లు విలువైన బంగారు, వెండి ఆభరణాలు, వాహనాలు ఉన్నట్టు నిర్ధారించారు. కోండ్రు మురళీపై శ్రీకాకుళం జిల్లా ఆమదాలవలస మండలం ఆమదాలవలస పోలీస్ స్టేషన్‌లో క్రైమ్ నంబర్ 161/22 కేసు నమోదైంది. 2022 ఆగస్టు నెలలో సెక్షన్ 30లో ఈ కేసును నమోదుచేశారు.

సమరానికి.. సై..!

వేలాదిగా తరలివచ్చిన కార్యకర్తలతో జనసంద్రమైన వీధులు.. మద్దతు పలుకుతూ పెద్దసంఖ్యలో బారులుతీరిన ప్రజలు.. దశదిశలా మార్మోగిన జై జగన్.. జై శంబంగి.. నినాదాల నడుమ వైఎస్సార్ సీపీ బొబ్బిలి ఎమ్మెల్యే అభ్యర్థి శంబంగి వెంకట చినఅప్పలనాయుడు నామినేషన్ అట్టహాసంగా శుక్రవారం జరిగింది. సార్వత్రిక ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైన రెండో రోజే సమరానికి సై అంటూ బరిలోకి దిగారు. ప్రజాప్రభుత్వానికి ప్రతిఒక్కరూ అండగా నిలవాలని, మే 13న జరిగే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటేసి, తనను మళ్లీ అసెంబ్లీకి పంపించాలని ఎమ్మెల్యే అభ్యర్థి శంబంగి కోరారు.

- అట్టహాసంగా వైఎస్సార్ సీపీ బొబ్బిలి ఎమ్మెల్యే అభ్యర్థి నామినేషన్
- భారీగా తరలివచ్చిన పార్టీ శ్రేణులు
- దారిపొడవునా అభిమాన నాయకుడికి జననీరాజనం
- హోరెత్తిన జై జగన్, జై శంబంగి నినాదాలు



నామినేషన్ అనంతరం ఆర్‌డీవో కార్యాలయం వద్ద మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంబంగి



మద్దతుదారులతో కలిసి నామినేషన్ వేసేందుకు వెళ్తున్న వైఎస్సార్ సీపీ బొబ్బిలి ఎమ్మెల్యే అభ్యర్థి ఎమ్మెల్యే శంబంగి

బొబ్బిలి: మండల కేంద్రంలోని ఆర్‌డీవో కార్యాలయంలో వైఎస్సార్ సీపీ బొబ్బిలి ఎమ్మెల్యే అభ్యర్థిగా ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు శుక్రవారం నామినేషన్ దాఖలు చేశారు. ఆయనకు మద్దతుగా నియోజకవర్గంలోని రామభద్రపురం, తెర్లాం, బొబ్బిలి, బాడంగి మండలాల నుంచి వేలాది మంది పార్టీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు, మద్దతుదారులు తరలివచ్చారు. యువత, మహిళలంతా నృత్య ప్రదర్శనలతో ఘనస్వాగతం పలికారు. ఉదయం 9 గంటలకు స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో గోమాత పూజ అనంతరం ఎమ్మెల్యే శంబంగి నామినేషన్ వేసేందుకు పార్టీ శ్రేణులతో ర్యాలీగా బయలుదేరారు. ఈ క్రమంలో ఆయనకు మద్దతుగా పార్టీ శ్రేణులు చేసిన జై శంబంగి, జై జగన్, జై వైఎస్సార్ సీపీ నినాదాలు మిన్నంటాయి. తొలుత ఆయన వేణుగోపాలస్వామి ఆలయంలో నామినేషన్ పత్రాలు ఉంచి, ప్రత్యేక పూజలు చేశారు. ఆ తర్వాత అభిమాన గణంతో పెద్దబజారు మీదుగా ర్యాలీగా బయలుదేరిన ఆయనకు అడుగడుగునా జనం నీరాజనం పలికారు. ఎమ్మెల్యే శంబంగి కూడా తనకు మద్దతు తెలుపుతున్న ప్రతిఒక్కరికీ అభివాదం చేస్తూ ఉత్సాహపరిచారు. ర్యాలీ అనంతరం నామినేషన్ వేసేందుకు ముందు బొబ్బిలి ఫ్లైఓవర్ వద్ద ఉన్న ఆంజనేయస్వామి ఆలయం వద్ద ఎమ్మెల్యే శంబంగి కాసేపు మాట్లాడారు. తనకు మద్దతు తెలిపిన వారందరికీ కృతజ్ఞతలని, రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ప్రతిఒక్కరూ ఓటు వేసి, ప్రజాప్రభుత్వాన్ని ఆశీర్వదించి, అధికారంలోకి తీసుకురావడంతో పాటు ఎమ్మెల్యేగా మరోసారి పోటీ చేస్తున్న తనను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ క్రమంలో ఆ ప్రాంగణమంతా జై జగన్.. జై శంబంగి.. నినాదాలతో హోరెత్తింది. ఈ వాతావరణం ఎమ్మెల్యే శంబంగిలో ముందస్తు గెలుపు ఉత్సాహం నింపింది.

మూడు సెట్ల నామినేషన్లు దాఖలు..

ర్యాలీ అనంతరం ఆర్‌డీవో కార్యాలయంలోకి పరిమిత సంఖ్యలోని మద్దతుదారులతో ప్రవేశించిన ఎమ్మెల్యే శంబంగి మూడు సెట్ల నామినేషన్ పత్రాలను ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఆర్‌డీవో సాయిశ్రీకి అందజేశారు. ఆయన నామినేషన్‌ను కె.శ్రీనివాసరావు, టి.తిరుపతిరావు, సీహెచ్ సత్యవతిలు ప్రతిపాదించగా, శ్రీకాంత్ నామినేషన్‌ను జి.శ్రీనివాసరావు, జి.శ్రీరామ్మూర్తి, బి.శ్రీనివాసరావులు ప్రతిపాదించారు. నామినేషన్ పత్రాలను అభ్యర్థులతో ఎన్నికల రిటర్నింగ్ అధికారి చదివించారు. ఆ తర్వాత డిపాజిట్లు స్వీకరించి, రసీదులు అందజేశారు. అలాగే ఎన్నికల కమిషన్ జారీ చేసిన నిబంధనలకు సంబంధించిన పుస్తకాల సెట్‌ను అభ్యర్థులకు అందజేసి, నిబంధనలు ఖచ్చితంగా పాటించాలని ఆర్‌డీవో కోరారు.

ప్రజాప్రభుత్వాన్ని గెలిపించండి..

నామినేషన్ దాఖలు చేసిన అనంతరం మీడియాతో మాట్లాడిన ఎమ్మెల్యే అభ్యర్థి, ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు రానున్న ఎన్నికల్లోనూ మరోసారి ఫ్యాన్ గుర్తుకు ఓటేసి, ప్రజాప్రభుత్వాన్ని గెలిపించాలని అభ్యర్థించారు. ఈ ఐదేళ్లలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ద్వారా కలిగిన మేలును ప్రతిఒక్కరూ గుర్తు పెట్టుకోవాలన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం కొనసాగాలంటే మళ్లీ జగనన్నే ముఖ్యమంత్రి కావాలన్నారు. తనను కూడా ఆశీర్వదించి, మరోసారి ఎమ్మెల్యేగా గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

అభివృద్ధి చేసి చూపించాం..

పార్టీ నియోజకవర్గ పరిశీలకుడు మావుడి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఈ ఐదేళ్ల వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో బొబ్బిలి నియోజకవర్గంలో ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు సమక్షంలో అభివృద్ధి, సంక్షేమం ప్రజలు ఆశించిన స్థాయి కన్నా ఎక్కువగా జరిగిందన్నారు. గతంలో ఎన్నడూ లేనంతగా నియోజకవర్గంలో సంక్షేమం, అభివృద్ధి చేసి, చూపించామన్నారు. మే 13న జరిగే ఎన్నికల్లోనూ ఫ్యాన్ గుర్తుకు ఓటేసి, వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని ఆశీర్వదించి, అధికారంలోకి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే శంబంగి తనయుడు శ్రీకాంత్, మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీ కృష్ణారావు, రాష్ట్ర ఆర్థిక మండలి మాజీ సభ్యుడు తూముల భాస్కరరావు, మాజీ మున్సిపల్ చైర్మన్ ఇంటి గోపాలరావు, వైద్య విభాగం జిల్లా అధ్యక్షుడు బొత్స కాశినాయుడు, జేసీఎస్ ఇన్‌చార్జ్‌లు, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

తరలిన అభిమాన గణం..

తెర్లాం: వైఎస్సార్ సీపీ బొబ్బిలి ఎమ్మెల్యే అభ్యర్థిగా శంబంగి వెంకట చినఅప్పలనాయుడు నామినేషన్ కార్యక్రమానికి మండలం నుంచి పార్టీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు భారీగా తరలివెళ్లారు. మండలంలోని 33 గ్రామ పంచాయతీల్లోని ప్రతీ ఇంటి నుంచి ఒకరిద్దరు చొప్పున వెళ్లి, ఆయనకు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు తెంటు సత్యంనాయుడు, ఎంపీపీ ప్రతినిధి నర్సుపల్లి బాబ్జీరావు, జెడ్పీటీసీ ప్రతినిధి గర్భాపు రామారావు, బొబ్బిలి ఏఎంసీ చైర్మన్ బొమ్మి శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ చేపేన సత్యనారాయణ, డీసీసీబీ డైరెక్టర్ బోను అప్పలనాయుడు పాల్గొన్నారు.



బొబ్బిలి కోట వద్ద వైఎస్సార్ సీపీ శ్రేణుల కోలాహలం



వేణుగోపాలస్వామి ఆలయంలో ఎమ్మెల్యే అభ్యర్థి శంబంగి పూజలు



ర్యాలీలో జేసీఎస్ ఇన్‌చార్జ్ విసు, పార్టీ నేతల డ్యాన్స్



ఉత్సాహంతో మహిళా నేతల అభివాదం



నామినేషన్ పత్రాలు అందజేస్తున్న జేసీఎస్ జిల్లా ఇన్‌చార్జ్ శ్రీకాంత్, పక్కనే ఎమ్మెల్యే శంబంగి

సంక్షేమ, అభివృద్ధి పాలనకు పట్టంకట్టండి



రేగిడిలో ఎన్నికల ప్రచారంలో ఫ్యాన్ గుర్తుకు ఓటేయాలని కోరుతున్న ఎమ్మెల్సీ విక్రాంత్, ఎమ్మెల్యే అభ్యర్థి తలే రాజేష్

- ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, వైఎస్సార్ సీపీ రాజాం ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ తలే రాజేష్

రేగిడి: రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చేసిన సంక్షేమం, అభివృద్ధి పాలనకే మళ్లీ పట్టంకట్టాలని, రానున్న ఎన్నికల్లోనూ సీఎం జగనన్ననే మరోసారి ముఖ్యమంత్రిని చేయాలని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, వైఎస్సార్ సీపీ రాజాం ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ తలే రాజేష్ కోరారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మండలంలోని కొర్లవలస, ఆమదాలవలస, రేగిడి గ్రామాల్లో శుక్రవారం పర్యటించిన ఆయా నేతలకు గ్రామస్తులు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్లిన వారు ఈ ఐదేళ్లలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమం వివరించారు. రాష్ట్ర సమగ్రాభివృద్ధి, ప్రజాసంక్షేమమే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అహర్నిశలు శ్రమిస్తున్నారని, రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలు, అన్నివర్గాల ప్రజలు అభివృద్ధి చెందేలా కార్యక్రమాలు చేపట్టారన్నారు. సచివాలయ వ్యవస్థ ద్వారా ఉన్న ఊరిలోనే ప్రజలకు పారదర్శకంగా ప్రభుత్వ సేవలు అందేలా చేయడంతో పాటు గ్రామాల్లో మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేశారన్నారు. అలాగే వలంటీర్ వ్యవస్థ ద్వారా లబ్ధిదారుల వద్దకే సంక్షేమ పథకాలు అందించారన్నారు. ఇదే అభివృద్ధి, సంక్షేమం కొనసాగాలంటే మే 13వ తేదీన జరిగే ఎన్నికల్లో అందరూ ఫ్యాన్ గుర్తుకే ఓటు వేసి, వైఎస్సార్ సీపీని గెలిపించాలన్నారు. ఎన్నికల వేళ మాయమాటలు చెప్పే టీడీపీ నేతలను నమ్మవద్దని, టీడీపీ కూటమికి ఓటేస్తే గతంలో జరిగిన మోసమే పునరావృతమవుతుందన్న విషయం గుర్తుంచుకోవాలన్నారు. రానున్న ఎన్నికల్లో ఎమ్మెల్యే, ఎంపీ ఓట్లు రెండూ ఫ్యాన్ గుర్తుకే వేసి, ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్న తలే రాజేష్‌ను, ఎంపీగా బరిలో ఉన్న బెల్లాన చంద్రశేఖర్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఎమ్మెల్సీ అభ్యర్థించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ టంకాల అచ్చెన్నాయుడు, పార్టీ మండల అధ్యక్షుడు వావిలపల్లి జగన్మోహనరావు, రేగిడి, సంకిలి పీఏసీఎస్ అధ్యక్షులు వంజరాపు అశోక్‌కుమార్, లావేటి వెంకటవేణుగోపాలనాయుడు, జేసీఎస్ కన్వీనర్ కింజరాపు సురేష్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీని గెలిపించండి



రాజాం: సోపేరులో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు



తెర్లాం: ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని కోరుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు

రాజాం: రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకే ఓటు వేసి, వైఎస్సార్ సీపీని మరోసారి ఆశీర్వదించి, గెలిపించాలని జెడ్పీటీసీ బండి నర్సింహులు, జేసీఎస్ కన్వీనర్ కామోదుల శ్రీనివాసరావు కోరారు. మండలంలోని సోపేరు గ్రామంలో శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించిన వారికి గ్రామస్తులు సాదర స్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్లిన వారు ఈ ఐదేళ్లలో ప్రభుత్వం ప్రజలకు చేసిన మంచిని వివరించారు. మే 13వ తేదీన జరిగే ఎన్నికల్లో ఎమ్మెల్యే, ఎంపీ ఓట్లు వైఎస్సార్ సీపీకి వేసి, ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న తలే రాజేష్‌ను, ఎంపీ అభ్యర్థిగా బరిలో ఉన్న బెల్లాన చంద్రశేఖర్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ నక్క వర్షిణి, సోపేరు సర్పంచ్ ములగ రాము, ఎంపీటీసీ చిన్నారావు, పార్టీ కన్వీనర్ యడ్ల అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

తెర్లాం: మండలంలోని పలు గ్రామాల్లో ఎంపీపీ ప్రతినిధి బాబ్జీరావు, వైస్ ఎంపీపీలు సత్యనారాయణ, అప్పలరాజు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు తెంటు సత్యంనాయుడు, బొబ్బిలి ఏఎంసీ చైర్మన్ బొమ్మి శ్రీనివాసరావు, జెడ్పీటీసీ ప్రతినిధి గర్భాపు రామారావు, డీసీసీబీ డైరెక్టర్ బోను అప్పలనాయుడు కలిసి పలు గ్రామాల్లో శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి, జగనన్న ప్రభుత్వం చేసిన మేలును వివరించి, రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకే ఓటు వేసి, వైఎస్సార్ సీపీని గెలిపించాలని కోరారు. మే 13వ తేదీన జరిగే పోలింగ్‌లో అందరూ పాల్గొని, ఎమ్మెల్యే, ఎంపీ ఓట్లు రెండూ ఫ్యాన్ గుర్తుకే వేసి, ఎమ్మెల్యేగా శంబంగి వెంకట చినఅప్పలనాయుడును, ఎంపీగా బెల్లాన చంద్రశేఖర్‌ను మరోసారి గెలిపించాలని కోరారు.

టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి నామినేషన్

రాజాం: టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కోండ్రు మురళీమోహన్ శుక్రవారం నామినేషన్ వేశారు. మద్దతుదారులతో కలిసి ర్యాలీగా వెళ్లిన ఆయన తహసీల్దార్ కార్యాలయంలోని ఎన్నికల అధికారికి రెండు సెట్ల నామినేషన్ పత్రాలు సమర్పించారు. నామినేషన్ ప్రక్రియ ప్రారంభమైన నాటి నుంచి ఇప్పటివరకు రెండు నామినేషన్లు మాత్రమే వచ్చాయని ఎన్నికల అధికారి తెలిపారు.

నాణ్యమైన విద్యనందించాలి



విద్యార్థుల డిజిటల్ బోర్డు వినియోగాన్ని ప్రత్యక్షంగా పరిశీలిస్తున్న డిప్యూటీ డీఈవో మోహన్‌రావు

బాడంగి: విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలని బొబ్బిలి డిప్యూటీ డీఈవో మోహన్‌రావు సూచించారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను శుక్రవారం సందర్శించిన ఆయన తరగతుల వారీగా విద్యార్థుల వద్దకు వెళ్లి, వివిధ ప్రశ్నల ద్వారా వారి విద్యాసామర్థ్యాలను పరిశీలించారు. పిల్లలకు అర్థమయ్యే రీతిలో విద్యాబోధన చేయాలని, చదువులో వెనకబడిన విద్యార్థుల విద్యాప్రగతిపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. అనంతరం విద్యార్థుల కోసం సిద్ధం చేసిన మధ్యాహ్న భోజనాలు పరిశీలించి, మెనూ ప్రకారం వంటకాలు చేయాలని, వంటకాలు రుచి, శుచి కలిగి ఉండాలని నిర్వాహకులకు తెలిపారు. ఆయన వెంట ఎంఈవో-2 రాజేశ్వరి, ప్రధానోపాధ్యాయుడు సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

వైఎస్సార్ సీపీలోకి భారీగా వలసలు



పార్టీలో చేరిన వారితో ఎంపీపీ లక్ష్మణరావు, తదితరులు

రామభద్రపురం: ఎన్నికల వేళ ఇతర పార్టీల నుంచి నేతలు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో వైఎస్సార్ సీపీలోకి వలస వస్తున్నారు. మండల కేంద్రంలోని గూడేపు వీధికి చెందిన 50 కుటుంబాల వారు శుక్రవారం వైఎస్సార్ సీపీలో చేరారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో పార్టీ సీనియర్ నాయకుడు కనిమెరక అప్పారావు ఆధ్వర్యంలో పార్టీలో చేరిన వారందరికీ ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు పార్టీ కండువాలు వేసి, సాదరంగా ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో గనగల్ల శ్రీనివాసరావు, గంట లక్ష్మణరావు, ఎరుపల్లి ఎల్లాజీ, వాసుపల్లి రాములు, ఎరుపల్లి వెంకటరమణ, మారుపల్లి రాము, వాసుపల్లి దాసు, మారుపల్లి సత్తియ్య తదితరులు ఉన్నారు. వీరంతా మాట్లాడుతూ సీఎం జగనన్న సంక్షేమ పాలన నచ్చే తామంతా పార్టీలో చేరామని, రానున్న ఎన్నికల్లో పార్టీ గెలుపు కోసం అహర్నిశలు శ్రమిస్తామన్నారు. ఎంపీపీ లక్ష్మణరావు మాట్లాడుతూ రోజురోజుకూ వైఎస్సార్ సీపీకి ఆదరణ పెరుగుతుండడం చాలా ఆనందంగా ఉందని, రానున్న ఎన్నికల్లో పార్టీ గెలుపు తథ్యమని జోష్యం చెప్పారు. పార్టీని నమ్ముకుని, కష్టపడిన వారికి పార్టీలో ఎప్పుడూ సముచిత గౌరవం ఉంటుందన్నారు. కార్యక్రమంలో మండల జేసీఎస్ కన్వీనర్ చింతల సింహాచలంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ



విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనం పరిశీలిస్తున్న ఎంఈవో ప్రసాదరావు

రేగిడి: విద్యార్థుల చదువుతో పాటు ఆరోగ్యంపై కూడా ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఉపాధ్యాయులు, తల్లిదండ్రులకు ఎంఈవో ఎం.వి.ప్రసాదరావు సూచించారు. మండలంలోని ఆమదాలవలస గ్రామ ఎంపీపీ పాఠశాలను శుక్రవారం సందర్శించిన ఆయన విద్యార్థుల హాజరుశాతం, మధ్యాహ్న భోజనం పథకం అమలుపై ఆరాతీశారు. విద్యార్థులకు నాణ్యమైన చదువు, ఆహారం అందించే బాధ్యతను ప్రభుత్వం తీసుకుందని, దానిని సక్రమంగా అమలు చేసే బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని తెలిపారు. వేసవి నేపథ్యంలో పాఠశాలకు వచ్చే ప్రతీ విద్యార్థి బ్యాగులో తాగునీటి బాటిల్ పెట్టి, పంపించాలన్నారు. పాఠశాలలో కూడా విద్యార్థులకు అందుబాటులో తాగునీరు ఉంచాలన్నారు.

వలంటీర్ల రాజీనామా



రాజాం: రాజీనామా పత్రాలు చూపిస్తున్న వలంటీర్లు



సంతకవిటి: పంచాయతీ కార్యదర్శికి రాజీనామా పత్రాలు అందిస్తున్న మిర్తివలస వలంటీర్లు



రామభద్రపురం: ఎంపీడీవో ఈశ్వరమ్మకు రాజీనామా పత్రాలు అందజేస్తున్న వలంటీర్లు



బొబ్బిలి: రాజీనామా చేసిన వలంటీర్లు

రాజాం: మండలంలోని పెనుబాక గ్రామపంచాయతీకి చెందిన 19 మంది వలంటీర్లు శుక్రవారం రాజీనామా చేశారు. వారంతా తమ వ్యక్తిగత కారణాలతోనే రాజీనామా చేసినట్లు చెప్పారని ఎంపీడీవో శ్రీనివాసరావు తెలిపారు.

సంతకవిటి: మండలంలోని మొద్దూరు సచివాలయ పరిధిలోని 17 మంది, కొండగూడెం సచివాలయం పరిధిలోని 16 మంది, మిర్తివలస సచివాలయం పరిధిలోని 8 మంది, మామిడిపల్లి సచివాలయం పరిధిలోని 15 మంది వలంటీర్లు శుక్రవారం రాజీనామా చేసినట్లు ఎంపీడీవో జి.పైడితల్లి తెలిపారు.

రామభద్రపురం: మండలంలోని నాయుడువలస గ్రామానికి చెందిన ఆరుగురు, సోంపురానికి చెందిన ఒకరు, మండల కేంద్రానికి చెందిన ఇద్దరు వలంటీర్లు శుక్రవారం రాజీనామా చేశారు.

బొబ్బిలి: పట్టణంలోని 16వ వార్డుకు చెందిన 9 మంది వలంటీర్లు శుక్రవారం రాజీనామా చేశారు. అనంతరం వారంతా స్థానిక కౌన్సిలర్ ఎస్.రామకృష్ణ(బాబు) వద్దకు వచ్చి, ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు విజయానికి కృషి చేస్తామని తెలిపారు.